ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
14-07-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 319 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



# 'గృహజ్యోతి' స్కీమ్ అర్హులకు అలర్ట్

జయభేరి, హైదరాబాద్, జూలై 13:

గృహజ్యోతి పథకానికి సంబంధించి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కీలక అప్డేట్ ఇచ్చింది. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మరో అవకాశం ఇచ్చింది. ఈ మేరకు TGSPDCL సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హత ఉన్న వాళ్లు వినియోగించుకోవాలని సూచించారు.తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ను అందించేందుకు గృహజ్యోతి స్కీమ్ ను తీసుకొచ్చింది. ఇందుకోసం మార్గదర్శకాలను ఖరారు చేసిన లబ్ధిదారులను గుర్తించింది. ప్రత్యేకంగా ప్రజాపాలన అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించింది. ఇందులో ఉచితి విద్యుత్ స్కీమ్ కు సంబంధించిన దరఖాస్తుల్లో

...మిగతాది 2 లో

# పేదరికం లేని సమాజం నా జీవిత లక్ష్యం

- సంపద సృష్టి ద్వారా సంక్షేమం అందుతుంది...ప్రజల జీవితాలు మారుతాయి
- కూటమి గెలుపుతో ప్రజల్లో అంశాంతి పోయి... ప్రశాంతంగా, సంతోషంగా కనిపిస్తున్నారు
- రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఇంకా మొదలు పెట్టక ముందే ప్రజల్లో నమ్మకం మొదలైంది
- ధార్మిక, ఆధ్యాత్మిక సంస్థలతోనే ప్రజలకు స్వాంతన
- హరే కృష్ణ మూవ్మెంట్, అక్షయ పాత్ర చేస్తున్న ఆధ్యాత్మిక సేవను అభినందిస్తున్నా
- అక్షయ పాత్ర ద్వారా మళ్లీ రాష్ట్రంలో అన్నా క్యాంటీన్ లు ప్రారంభిస్తాం :నారా చంద్రబాబు నాయుడు
- కొలనుకొండ గోకుల క్షేత్రంలో వెంకటేశ్వర ఆలయంలో అనంత శేష స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు నాయుడు



ధర్మాన్ని కాపాడటానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండటం అందరి అదృష్టమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. “ఏ మతానికి సంబంధించిన ప్రార్థనాలయాలైనా ఈ భూమిపై లేకపోతే జైళ్లు చాలవు. నేరాలు, ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయ వ్యవస్థ...ఇలా అందరూ తమ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాల పాటు దేవున్ని ప్రార్థిస్తారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా దేవుడికి ప్రార్థనలు చేశాకే రాకెట్లు నింగిలోకి పంపుతారు. హరేకృష్ణ మూవ్ మెంట్ దేవుని సేవ మాత్రమే కాకుండా మానవ సేవ కూడా చేస్తోంది. యూపీలో వంద ఎకరాల్లో 700 అడుగుల కృష్ణుడు దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. కొలనుకొండలో 6.5 ఎకరాల్లో ఇక్కడ దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. నేను సాంకేతిక పరిజ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. 25 ఏళ్లకు ముందు ఐటీని ప్రమోట్ చేస్తే అన్ని దేశాలకు మన దేశానికి చెందిన వారు వెళ్లారు... వారిలో 30 వాతం మంది తెలుగు వారు ఉన్నారు. నేను ఎప్పుడూ వెంకటేశ్వర స్వామినే నమ్ముతాను. మా కుటుంబ ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి. ప్రతి రోజు రెండు నిమిషాలు దేవున్ని తలుచుకుంటా. 2003లో తిరుపతిలో 23 క్లైమోర్ మైన్స్ పేలినప్పుడు నాకు ప్రాణభిక్ష పెట్టింది వెంకటేశ్వరస్వామే. మరింత శక్తి, సామర్థ్యాన్ని ఇవ్వాలని, దేశంలో తెలుగువారు నెంబర్ వన్ జాతిగా ఉండేలా దీవించాలని కోరుకుంటా. పేదరికం లేని సమాజం మనందరి బాధ్యత కావాలి.” అని సీఎం పిలుపునిచ్చారు.

2 లో



# మేము బీజేపీలో అందుకే చేర్చుకోవట్లేదు..

- రఘునందన్ షాకింగ్ కామెంట్స్

జయభేరి, హైదరాబాద్:

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై మెదక్ ఎంపీ రఘునందనరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏడు నెలల్లో గులాబీ రంగు మూడు వర్ణాలు అయింది తప్ప. పాలనలో మార్పు లేదని విమర్శించారు. రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతోన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పదవికి రాజీనామా చేస్తేనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బీజేపీలో చేర్చుకుంటామని స్పష్టం చేశారు. బీజేపీలో చేరటానికి చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ కార్యాలయంలో మీడియాతో రఘునందన్ మాట్లాడుతూ. ఉప ఎన్నికకు సిద్ధంగా ఉంటేనే చేర్చుకుంటామని టచ్‌లో ఉన్న ఎమ్మెల్యేలకు చెప్పామని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను అరెస్ట్ చేయటానికి రేవంత్ సర్కార్ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. అవినీతికి పాల్పడిన సంబంధిత మంత్రులను అరెస్ట్ చేయటానికి మీనమేషాలు లెక్కిస్తోందని విమర్శలు చేశారు. ఏడు నెలల్లో,ఆర్ ట్యాక్స్, బీ ట్యాక్స్, యూ ట్యాక్స్ రాజ్యమేలుతోందని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీ మేరకు వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతు భరోసా కోసం పోరాటం చేయాలని కార్యవర్గ సమావేశాల్లో తీర్మానించామని అన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉండాలని నిర్ణయించామని చెప్పారు. నిరుద్యోగులపై ప్రతిపక్షంలో ఒకమాట.. అధికారంలో వచ్చాక మరోమాట కాంగ్రెస్ మాట్లాడుతోందని చెప్పుకొచ్చారు. ఓటమి భయంతోనే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేస్తోందని చెప్పారు. నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతికి రూ.4,116 లేవు కానీ. సీఎం రేవంత్ రూ. 4 లక్షలు నెల జీతం తీసుకుంటున్నాడని చెప్పారు. దేశంలో ఎక్కువ నెల జీతం రేవంత్ తీసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వలేదని ఎంపీ రఘునందనరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మత్తుపదార్థాల నిర్మూలన కోసం

జయభేరి, హైదరాబాద్, జూలై 13:

సమాజంలో అసాంఘికతకు, అశాంతికి కారణమయ్యే గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను కూకటివేళ్లతో పెకిలించి తెలంగాణ రాష్ట్ర ఉన్నతిని తిరిగి నిలబెట్టుకునే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తలకెత్తుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు సామాజిక చైతన్య ఉద్యమాలకు నిలయమైన తెలంగాణ గడిచిన పదేండ్లలో గాడితప్పి, మత్తు పదార్థాలకు అడ్డాగా మారడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ సమాజం మనది, దీనిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మనదే అనే స్పృహ ప్రతి ఒక్కరిలో కలగాలని, ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసులా వ్యవహరిస్తేనే సమాజంలో చెడు పోకడలను నియంత్రించడం సాధ్యమవుతుందని అన్నారు. హైదరాబాద్ లోని జేఎన్టీయూ వేదికగా శనివారం "డ్రగ్స్ వ్యతిరేక పోరు, మహిళా భద్రత, రోడ్డు భద్రతలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల భాగస్వామ్యం" అనే అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడారు.

...మిగతాది 2 లో





# కాంగ్రెస్ లోకి మరో ఎమ్మెల్యే గాంధీ

జయభేరి, హైదరాబాద్, జూలై 13:

తెలంగాణలో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలు హస్తం పార్టీలో చేరగా.. తాజాగా ఆ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గాంధీతో పాటు ఆయన అనుచరులు, పలువురు

...మిగతాది 2 లో



# 22 తర్వాత కవితకు బెయిల్

జయభేరి, హైదరాబాద్, జూలై 13:

లిక్కర్ కేసులో అరెస్ట్ అయిన ఎమ్మెల్సీ కవిత కష్టాలు తీరట్లేదు. దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్‌పై విచారణ 22కి వాయిదా వేసింది కోర్టు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై రౌస్ అవెన్యూ కోర్టు విచారణను వాయిదా వేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తనకు డిఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరారు కవిత. విచారణ జరిపిన కోర్టు.. కేసులో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై పరిశీలించింది. సీబీఐ కేసులో డిఫాల్ట్ బెయిల్ ఇచ్చే పిటిషన్ విచారణను జులై 22కు వాయిదా వేసింది. వాయిదా వేస్తున్న విషయాన్ని ట్రయల్ కోర్టు జడ్జి కావేరి భవేజా తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు కస్టడీలో ఉండాలని ఆదేశించారు. లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవితకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి.మార్చి 16న అరెస్ట్ చేసిన ఈడీ

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## పేదరికం లేని... నా జీవిత లక్ష్యం

ధర్మాన్ని కాపాడటానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండటం అందరి అదృష్టమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ప్రపంచాన్ని ముందుకు నడిపించేంది కేవలం నమ్మకమేనని, మనకు తెలియని ఏకైక శక్తి దేవుడేనని అన్నారు. తాడేపల్లి సమీపంలోని కొలనుకొండలో హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ''ఏ కార్యక్రమాన్నైనా సజావుగా చేయగలుగుతామన్న నమ్మకాన్ని హరేకృష్ణ మూవ్ మెంట్ మనకు కలిగిస్తుంది. హరేకృష్ణ గోకుల్ కృష్ణ క్షేత్రాలు దేశంలో 20 ఉన్నాయి...ప్రపంచంలో 5 ఉన్నాయి. హరేకృష్ణ మూవ్ మెంట్ తో పోటీపడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలు చేస్తోంది. మధుపండిత్ దాస అనుకున్నది సాధిస్తారు. నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతారు. సత్యగౌర చంద్రదాస్ కూడా ఐఐటీలో చదివారు. హరేకృష్ణ మూవ్ మెంట్ లో ఐఐటీలో చదివిన వారు 50 మంది ఉన్నారు. ఇస్కాన్ లో కూడా ఐఐటీలో గ్రాడ్యుయేషన్ పొందిన వారున్నారు. మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడటానికి జీవితాలు త్యాగాలు చేశారు. హరేకృష్ణ గోకుల క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ప్రతిష్టాత్మక నిర్మాణం జరుగుతోంది. 216 అడుగల ఎత్తున్న ప్రధాన గోపురంతో వెంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారు. ఇది ఒక ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుంది'' అని సీఎం చంద్రబాబు అన్నారు.

''ఏ మతానికి సంబంధించిన ప్రార్థనాలయాలైనా ఈ భూమిపై లేకపోతే జైళ్లు చాలవు. నేరాలు, ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయ వ్యవస్థ...ఇలా అందరూ తమ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాల పాటు దేవున్ని ప్రార్థిస్తారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా దేవుడికి ప్రార్థనలు చేశాకే రాకెట్లు నింగిలోకి పంపుతారు. హరేకృష్ణ మూవ్ మెంట్ దేవుని సేవ మాత్రమే కాకుండా మానవ సేవ కూడా చేస్తోంది. యూపీలో వంద ఎకరాల్లో 700 అడుగుల కృష్ణుడు దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. కొలనుకొండలో 6.5 ఎకరాల్లో ఇక్కడ దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. నేను సాంకేతిక పరిజ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. 25 ఏళ్లకు ముందు ఐటీని ప్రమోట్ చేస్తే అన్ని దేశాలకు మన దేశానికి చెందిన వారు వెళ్లారు...వారిలో 30 వాతం మంది తెలుగు వారు ఉన్నారు. నేను ఎప్పుడూ వెంకటేశ్వర స్వామినే నమ్ముతాను. మా కుటుంబ ఆరాధ్య దైవం వెంకటేశ్వరస్వామి. ప్రతి రోజు రెండు నిమిషాలు దేవున్ని తలుచుకుంటా. 2003లో తిరుపతిలో 23 క్లేమోర్ మైన్స్ పేలినప్పుడు నాకు ప్రాణభిక్ష పెట్టింది వెంకటేశ్వరస్వామే. మరింత శక్తి, సామర్థ్యాన్ని ఇవ్వాలని, దేశంలో తెలుగువారు నెంబర్ వన్ జాతిగా ఉండేలా దీవించాలని కోరుకుంటా. పేదరికం లేని సమాజం మనందరి బాధ్యత కావాలి.'' అని సీఎం పిలుపునిచ్చారు.

''అక్షయపాత్ర యాజమాన్యాన్ని కూడా మనస్పూర్తిగా అభినందిస్తున్నా. మధు పండిత్ దాస్ నేతృత్వంలో అక్షయపాత్రను విజయవంతంగా నడిపిస్తున్నారు. శ్రీకృష్ణుడి ఆలయం ఉన్న 10 కి.మీ పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదన్న ఆలోచనతో లాలా ప్రభుపాద స్పూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారు. 23 ఏళ్లలో 400 కోట్లమందికి భోజనం పెట్టారు. వివిధ రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశుభ్రంగా, నాణ్యతతో అందిస్తున్నారు. 22 లక్షల మందికి ప్రతి రోజూ అక్షయపాత్ర ద్వారా ఆహారం అందిస్తున్నారు. కృష్ణాపుష్కరాల సమయంలో 3 లక్షల మందికి భోజనం అందించారు. అన్నా క్యాంటీన్ కు భోజన సరఫరా కూడా గతంలో అక్షయపాత్రకే అప్పగించాను. భోజన నాణ్యతలో ఒక్క చిన్న ఫిర్యాదు లేకుండా అన్న క్యాంటీన్లకు ఆహారం సరఫరా చేశారు. 203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించాం. కానీ గడిచిన ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసేసింది. త్వరలోనే అన్న క్యాంటీన్లు పున:ప్రారంభిస్తాం. ఎన్టీఆర్ తిరుపతిలో అన్నదానం ప్రారంభించారు. దాతలకు దేశంలో కొదవలేదు..నమ్మకం అనే వ్యవస్థ ఉండాలి. అక్షయపాత్ర ఆధునిక వసతులతో కిచెన్ ను నడిపిస్తోంది. ప్రజల నమ్మకం, భగవంతుడు ఆశీస్సులు హరేకృష్ణ గోకులం వారికి తప్పకుండా ఉంటాయి. పెనుకొండలో లక్ష్మీనరసింహా స్వామి 108 అడుగుల విగ్రహాన్ని ఏకశిలా రూపంలో ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు..దానికి కూడా గత ప్రభుత్వం అడ్డుపడింది. మంచికి వచ్చే ఐదేళ్లు స్పీడ్ బ్రేకర్లు ఉండవు..మంచి చేసే వారికి సహకరిస్తాం. ప్రపంచంలో ఎక్కడా లేని కుటుంబ వ్యవస్థ మన దేశంలో ఉంది. కుటుంబ వ్యవస్థ మనకు అన్ని విధాలా అండగా, రక్షణగా ఉంటుంది. తరతరాలుగా వస్తున్న వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. హరేకృష్ణ గోకులం, ఇస్కాన్ కు మా ప్రభుత్వం పూర్తిగా అండగా ఉండి, సహకరిస్తుంది.'' అని సీఎం చంద్రబాబు అన్నారు.

## గృహజ్యోతి' స్కీమ్ అర్హులకు అలర్ట్

పలువురు విద్యుత్ కనెక్షన్ నంబరును తప్పుగా ఎంట్రీ చేసి ఇచ్చారు. ఫలితంగా ఇలాంటి వారు అర్హత ఉన్నప్పటికీ జీరో బిల్లులు జనరేట్ కావటం లేదు.ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొత్తగా సవరణ చేసే అవకాశం కల్పించారు. అర్హులైన వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తామని... ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఏమైనా తప్పులు ఉంటే సవరణ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.జులై 1 నుంచి ఆర్‌బీఐ మార్గదర్శకాలను అనుసరించి విద్యుత్ బిల్లులు చెల్లింపు ప్రక్రియలో మార్పులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యాప్‌ల ద్వారా చెల్లించడం నిలిపివేసినట్లు విద్యుత్ పంపిణీ సంస్థలు ఇటీవలే ప్రకటన చేశాయి. దీంతో చాలా మంది వినియోగదారులు చెల్లింపుల విషయంలో కాస్త గందరగోళానికి గురువుతున్నారు. మళ్లీ కరెంట్ ఆఫీసులకు వెళ్లి పేమెంట్ చేయాలా..? అన్న సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.అయితే వినియోగదారులు గతంలో మాదిరిగానే సింపుల్ గా పేమెంట్ చేసే అవకాశం ఉంది. ఈ విషయంలో టెన్షన్ పడాల్సిన అవసరమే లేదు. ముందుగా మీరు TGSPDCL అధికారిక వెబ్ సైట్ లోకి వెళ్లాలి. హోం పేజీలోనే బిల్ పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇందులో వివరాలను నమోదు చేసి సింపుల్ గా కరెంట్ బిల్లును క్లియర్ చేసుకోవచ్చు. కేవలం వెబ్ సైట్ మాత్రమే కాదు... యాప్ ను కూడా ఇన్ స్టాల్ చేసుకోని ఈ ప్రక్రియను కంప్లీట్ చేయవచ్చు.

విద్యుత్ వినియోగదారుడు బిల్లు చెల్లించేందుకు ముందుగా https://tgsouthernpower.org/ వెబ్ సైట్ లోకి వెళ్లాలి. హోం పేజీలో Pay Bill online అనే ఆప్షన్పై కనిపిస్తుంది. దీనిపై నొక్కాలి. ఇక్కడ మీరు ఉపయోగించే నెంబర్‌ను నమోదు చేసి సబ్మిట్ బటన్ పై నొక్కాలి. బిల్ కు సంబంధించిన వివరాలను డిస్ ప్లే అవుతాయి. ఆ తర్వాత Click Here to Pay అనే ఆప్షన్పై నొక్కాలి. ఇక్కడ మరో పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో బిల్లు చెల్లించేందుకు రకరకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో ఒక దానిని సెలక్ట్ చేసుకోవాలి. ఇక్కడ డిబెట్ కార్డు లేదా T Wallet వంటి ఆప్షన్లు ఉంటాయి. మీకు అనువుగా ఉన్న దానిని ఎంపిక చేసి బిల్ క్లియర్ చేసుకోవచ్చు. ఇక వెబ్ సైట్ ద్వారానే కాకుండా... TGSPDCL యాప్ నుంచి కూడా ప్రాసెస్ పూర్తి చేయవచ్చు. ఇందుకోసం ముందుగా వినియోగదారుడు గూగుల్ ప్లే స్టోర్ నుంచి TGSPDCL యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇన్ స్టాల్ అయ్యాక.... బిల్ పేమెంట్ చేసుకోవచ్చు. ఇక వెబ్ సైట్, యాప్ ద్వారా కాకుండా... మీసేవా కేంద్రాలకు వెళ్లి కూడా పేమెంట్ చేయవచ్చు. ఇక మీకు దగ్గర్లోనే కరెంట్ ఆఫీస్ కేంద్రం ఉంటే అక్కడ కూడా పెండింగ్ బిల్లలను క్లియర్ చేయవచ్చు.

## కాంగ్రెస్ లోకి మరో ఎమ్మెల్యే గాంధీ

కార్పొరేటర్లు హస్తం తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఇప్పటివరకూ హస్తం పార్టీలో చేరిన ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది.ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాస్ గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

**'అభివృద్ధి కోసమే'**

నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. అభివృద్ధిపై సీఎం రేవంత్ తనకు హామీ ఇచ్చారని.. అందుకే కార్యకర్తలు, శ్రేయోభిలాషుల సూచనతోనే పార్టీ మారుతున్నట్లు చెప్పారు.

# రెండు జాతీయ పార్టీల మధ్య నలిగిపోతున్న కేసీఆర్



✍ జయభేరి, హైదరాబాద్, జూలై 13:

బీఆర్ఎస్.. ప్రస్తుతం తెలంగాణలో కనుమరుగవుతున్న పార్టీ. కాంగ్రెస్, బీజేపీ నేతలను ఈ అంశంపై పలకరిస్తే, కనుమరుగైపోయిన పార్టీ అని అంటారు. వాళ్ల మాటలు ఎలా ఉన్నా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన సీట్లు, సాధించిన ఓట్లను బట్టి బీఆర్ఎస్ ప్రాభవం క్రమక్రమంగా తగ్గిపోతోంది. ప్రచార సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలుపుతానన్నారు కేసీఆర్. కానీ, ఇప్పుడు ఆ రెండు పార్టీల మధ్యే ఆయన నలిగిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది.వరుస ఓటముల తర్వాత కేసీఆర్ పెద్దగా బయట కనిపించడం లేదు. ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. అటు చూస్తే కుమార్తె కవిత జైలులో ఊచలు లెక్కబెడుతున్నారు. కేటీఆర్ మాట వినే నేతలు తక్కువే. ఇదే అదునుగా పార్టీ నుంచి వలసలు జోరందుకున్నాయి. పోతే పోండి అన్న ధోరణిలో కేసీఆర్ ఈమధ్యే సమావేశాలు నిర్వహించి ఉన్న లీడర్లకు క్లాసులు తీసుకున్నారు. దొరికిందే ఛాన్స్ అని వరుసబెట్టి నాయకులు జంప్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడం అంత ఈజీ కాదనే వాదన జరుగుతోంది. ఇదే సమయంలో ఫాంహౌస్‌లో కేసీఆర్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. కేటీఆర్, హరీష్‌రావు ఢిల్లీ టూర్ ముగించుకుని వచ్చిన వెంటనే కేసీఆర్ సడెన్ మీటింగ్ పెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోంది.ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కే బెయిల్ రావడం కష్టమైపోయింది. అలాంటిది, కీలక సూత్రధారిగా పేర్కొన్న కవితకు బెయిల్ రావడం అంత ఈజీ పని కాదు. కానీ, కేటీఆర్ మాత్రం కవితను బయటకు తీసుకొస్తామని శపథం చేశారు. కొద్ది రోజుల క్రితం పార్టీ నేతలకు ఇదే చెప్పారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ఫ్లైట్ ఎక్కిన ఆయన, హరీష్‌తో కలిసి వారం రోజులు అక్కడే ఉన్నారు. లాయర్లతో అనేక చర్చలు జరిపారు. కవితనూ కలిసి ఓదార్చారు. ఈ టూర్ నేపథ్యంలో రకరకాల ప్రచారాలు జరిగాయి. బీజేపీతో కేటీఆర్, హరీష్ సంప్రదింపులు జరిపినట్టు వార్తలు వచ్చాయి. అయితే, ఈ ప్రపోజల్‌కు కమలనాథులు సరే అన్నారని, కాకపోతే కవితను అప్రూవర్‌గా మారమని కండిషన్ పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే విషయాన్ని నగరానికి వచ్చీ రాగానే కేసీఆర్‌కు కేటీఆర్, హరీష్ వివరించినట్టు మాట్లాడుకుంటున్నారు.ఓవైపు బీఆర్ఎస్ లీడర్లను కాంగ్రెస్ లాగేసుకుంటోంది. ఇంకోవైపు పలు కేసులు వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ మద్దతు ఉంటేనే మనుగడ సాధ్యమనే భావనలోకి కేసీఆర్ వచ్చినట్టుగా రాజకీయ వర్గాల్లో చర్చించుకుంటున్నారు. అందుకే, పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశం నిర్వహించి వారిని ట్యూన్ చేస్తున్నారని అంటున్నారు. మొత్తంగా కేటీఆర్, హరీష్ ఢిల్లీ టూర్ నేపథ్యంలో కేసీఆర్ తీసుకోబోతున్న నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**బీజేపీలోకి హరీశ్ రావు**

తెలంగాణలో నేతలు పార్టీల మార్పులకు సంబంధించి చర్చలు జోరుగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. తాజా రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే ఊహించని నేతలు సైతం ఇతర పార్టీలోకి వెళ్లి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఇటీవలే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కారణాలు ఏవైనా కూడా పార్టీని వీడటంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతున్నది. గతంలో కాంగ్రెస్ ను ఖాళీ చేసేందుకు ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ ఇప్పుడు ఖాళీ అవుతుందా..? ఏందీ అని అనుకుంటున్నారు జనాలు. ఇంకొందరు నేతలేమో బీఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమంటున్నారు. ఇటీవలే జరిగిన పార్లమెంటు ఎన్నికల సమయంలో కూడా బీఆర్ఎస్ నేతలు.. అది కూడా పేరు మోసిన ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, బీజేపీ పార్టీలోకి వెళ్లారు. అప్పుడు కూడా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద చర్చే జరిగింది.ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఇప్పటికీ పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో జాయిన్ అయ్యారు. తాజాగా ప్రకాశ్ గౌడ్ కూడా జాయిన్ అవుతనంటూ ప్రకటించారు. ఈ నేపథ్యంలో మరో అంశం తెరమీదకు వస్తోంది. సిద్ధిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కూడా బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నారంటూ పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతుంది.ఈ అంశంపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ కాబోతుందని చెప్పారు. హరీశ్ రావు కూడా పార్టీని వీడబోతున్నారని, బీజేపీలోకి వెళ్లబోతున్నారంటూ ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమంటూ ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. అందువల్ల కేసీఆర్ రాజకీయాలను వదిలేసి ఇంట్లోనే ఉంటే బెటర్ అని ఆయన సలహా ఇచ్చారు.కాగా, చాలా సందర్భాల్లో హరీశ్ రావు పార్టీ మారబోతున్నారంటూ పలువురు నేతలు పేర్కొన్న సందర్భంలో ఆయన స్పందించారు. ఆ నేతల వ్యాఖ్యలను ఖండించారు. తాను బ్రతికున్నన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని తేల్చిచెప్పారు. పార్టీని విడాల్సి వస్తే తాను రాజకీయాల నుంతి శాశ్వతంగా తప్పుకుంటానంటూ చెప్పుకొచ్చారు. అయితే, రాజగోపాల్ రెడ్డి ఈ విధంగా వ్యాఖ్యలు చేయడంతో భారీగా చర్చ కొనసాగుతుంది. హరీశ్ రావు నిజంగానే పార్టీ మారుతున్నారా..? అంటూ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు.చూడాలి మరి రాజగోపాల్ రెడ్డి చెప్పినట్టు హరీశ్ రావు పార్టీ మారబోతున్నారా లేదా అనేది. ఎందుకంటే.. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా ఇదే మాదిరిగా పార్టీని మారబోం..రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు బీఆర్ఎస్ లోనే ఉంటామని ఇవాళ చెప్పి.. రేపు మరో పార్టీలో చేరిపోయారు. ఈ పరిస్థితులను పరిశీలించిన ప్రజలు.. హరీశ్ రావు కూడా పార్టీ మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు అంటున్నారు.






## ఢిల్లీలో తెలంగాణ సంబరాలు

✍ జయభేరి, హైదరాబాద్ :

ప్రతి సంవత్సరం ఆనవాయితీగా శ్రీ సింహవాణి మహంకాళి టెంపుల్ లాల్ దర్వాజా వారు. ఈ సంబరాలను జరుపుతూ వస్తున్ననారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుండి శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ కళాకారులు పలు సాంస్కృతి కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ గణేష్ మాస్టర్, అసిస్టెంట్ మాస్టర్ లక్ష్మణ్ వారి విద్యార్థినీ విద్యార్థులచే నిర్వహించిన లుచ్చా కళారూపాలు ప్రేక్షకులను మయిమరిపించాయి. ముఖ్యంగా క్లాసికల్ ప్లే డాన్స్ చిన్నారి విష్ణువర్ధని ప్లేట్ డాన్స్ తో ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు సాయివర్ష, దీక్షిత, అక్షయ, భార్గవి, శ్రీలత, ఉత్ప్రేక్ష, నిత్య శ్రీ, విద్యార్థులు వారి నృత్యాలతో అలరించారు.





## 22 తర్వాత కవితకు బెయిల్

అధికారులు ఆమెను విచారణ పేరుతో రిమాండుకు తరలించారు. 100 రోజులు దాటినప్పటికీ ఆమెకు బెయిల్ విషయంలో అనేక ఇబ్బందులు తప్పడంలేదు. ఈడీ కేసుతో పాటూ సీబీఐ కూడా ఇందులో జోక్యం చేసుకుంది. చార్జ్ షీట్లో కవిత పేరును పేర్కొంది. దీనిపై స్పందించారు కవిత తరపు న్యాయవాది. విచారణ సమయంలో సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని కవిత తరపున సీనియర్ న్యాయవాది నితీశ్ రాణా వాదనలు వినిపించారు. దీనిపై కౌంటర్ ఇచ్చారు సీబీఐ తరపు న్యాయవాది. ఛార్జిషీట్‌లో ఎలాంటి తప్పులు లేవని స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉందని, బెయిల్ మంజూరు చేయడం సరికాదంటూ సీబీఐ తరపు న్యాయవాది వాదించారు.చార్‌జ్‌షీట్‌లో తప్పులున్నాయని కోర్టు ఆర్డర్ ఫైల్ చేశారా అని జడ్జి కావేరి భవేజా ప్రశ్నించారు. చార్‌జ్‌షీట్‌లో తప్పులుంటే కోర్టు ఆర్డర్ ఫైల్ చేయాలని తెలిపారు. అయితే కోర్టు ఆర్డర్ అప్‌లోడ్ కాలేదని కవిత లాయర్ నితీష్ రాణా తెలిపారు. డిఫాల్ట్ బెయిల్, చార్జ్ షీట్‌పై తప్పులపై విచారణ జరిగేంత వరకు చార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణ వాయిదా వేయాలని కోరారు కవిత లాయర్. చార్‌జ్‌షీట్ పూర్తిగా లేదని తాము వాదించడం లేదని, తప్పుగా ఉందని మాత్రమే చెబుతుననట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సీబీఐ తాము సరైన పద్ధతిలో చార్‌జ్‌షీట్ ఫైల్ చేశామని కోర్టుకు తెలిపింది. దీంతో 60 రోజుల తరువాత డిఫెక్టివ్ చార్‌జ్‌షీట్ దాఖలు చేయడం కవిత డిఫాల్ట్ బెయిల్ హక్కును కాలరాయడమేనన్నారు కవిత న్యాయవాది. కవిత డిఫాల్ట్ బెయిల్, సీబీఐ చార్‌జ్‌షీట్‌ను పరిగణలోకి తీసుకునే అంశంపైనా జూలై 22న విచారణ జరువుతామని తెలిపింది. దీంతో కవిత బెయిల్ పిటిషన్ పై విచారణ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అరెస్ట్ అయి 119 రోజులుగా జూడీషియల్ కస్టడీలో ఉన్న కవితకు జూలై 18 వరకూ కస్టడీ పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు వెలువరించింది కోర్టు. దీంతో బెయిల్ పిటిషన్ పై ఇప్పట్లో స్పష్టమైన ఆదేశాలు వెలువడే పరిస్థితులు కనిపించడం లేదంటున్నారు న్యాయనిపుణులు. జూలై 22 తరువాత చేపట్టే విచారణలో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు న్యాయవాదులు.

## మత్తుపదార్థాల నిర్మూలన కోసం

టెక్నాలజీ దుష్ప్రభావాలు, ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, కుటుంబ వ్యవస్థలో ఒడిదొడుకులు తప్పని నేటి పరిస్థితుల్లో మన భావితరాలను భద్రంగా కాపాడుకోవాలంటే కమ్యూనిటీ పోలీసింగ్ లో అందరూ భాగం పంచుకోవాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాల బారిన పడి నిర్వీర్యమయ్యే దుస్థితి తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లో రావొద్దన్నారు. తెలంగాణలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల నిర్మూలన కోసం @TG_ANB విభాగాన్ని పటిష్టంచేసి ఏకంగా యుద్ధం చేస్తున్న విషయాన్ని నొక్కి చెప్పారు. మాదకద్రవ్యాలపై చేస్తున్న యుద్ధంలో సామాన్య ప్రజలతోపాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు సైనికులై కదలిరావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# రజకుల బతుకు ఛిద్రం

- గుండ్లపోచంపల్లి నారాయణ చెరువులో మునిగిన దోబీఘాట్..
- వృత్తికి దూరమౌతున్నామంటూ రజకుల ఆవేదన..
- ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం ఇచ్చిన తీరని సమస్య..
- ప్రభుత్వం ఆదుకోవాలని రజకుల ఆవేదన



**జయభేరి, మేడ్చల్ :**

అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని ఉందన్న చందంగా మారింది గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని రజకుల పరిస్థితి. వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకుల దోబీఘాట్ నీటిలో మునిగిపోవడంతో రజకులు కులవృత్తిని కొనసాగించలేక అప్పులపాలవుతున్నారు. గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని రజకుల పరిస్థితి నీళ్లు లేకనో... వసతులు లేకనో.. అప్పులపాలవడం లేదు. డోబీఘాట్ ఉన్న నారాయణ చెరువు చుట్టూ కట్టుకాలువలు... నాలాలను కబ్జా చేసి నిర్మాణాలు సైతం చేపట్టడంతో చెరువులో ఉన్న నీరు బయటకు పంపించే మార్గం లేక రజకులకు సంబంధించిన దోబీఘాట్ నీళ్లలోనే మునిగిపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రజకులు వృత్తిని కొనసాగించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మేడ్చల్ మండల పరిధిలోని గుండ్లపోచంపల్లి పురపాలక సంఘంలో నిత్యం తమ వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే రజకులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రజక వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కుటుంబాలు తమ వృత్తిలో భాగంగా బట్టలు ఉతుకేందుకు సరైన దోబీఘాట్ లేక అప్పులపాలై అనేక అవస్థలు పడుతున్నారు. గుండ్లపోచంపల్లి గ్రామం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో నారాయణ చెరువులో నిర్మించిన దోబీఘాట్ వర్షాకాలంలో కురిసిన వర్షానికి కొన్ని సంవత్సరాలుగా చెరువులోనే ఉండిపోయింది. అధికారులు నీళ్లు లేని సమయంలో చెరువు స్థలం చూపించడంతో నీళ్లకు సమీపంలో దోబీఘాట్ నిర్మించారు. కానీ రజకుల కోసం నిర్మించిన దోబీఘాట్ ఇప్పుడు వారికి శాపంగా మారింది. గతంలో కురిసిన వర్షాలతో చెరువు నిండి వారి కోసం నిర్మించిన దోబీఘాట్ నారాయణ చెరువు నీళ్లలోనే సమాధై బట్టలు ఉతకడానికి వీలు లేకుండా మారింది. చెరువు నాలాలు కబ్జాకు గురికావడంతో చెరువు నిండినప్పుడు చెరువు నీళ్లు బయటకు వెళ్లేందుకు ప్రస్తుత పాలకవర్గం సుమారు కోటి రూపాయల నిధులతో నాలా పనులు చేసిన చెరువులో నీరు అలాగే ఉండడంతో ధోబీఘాట్ నీటిలోని మునిగి ఉంది.

**నాలా పనులు పూర్తి చేసిన తీరని సమస్య**

వర్ష కాలంలో నారాయణ చెరువు పూర్తిగా నిండి ధోభీఘట్ తో పాటు లక్ష్మీనగర్ కాలనీలోని నివాస ప్రాంతాలు నీటిలో మునిగిపోవడంతో మున్సిపల్ పాలకవర్గం సుమటు రూ.1 కోటి రూపాయలతో చెరువు నీరు బయటకు వెళ్లేందుకు నాలా పనులు పూర్తి చేశారు. కానీ చెరువులో మునిగిన ధోభీఘాట్ పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వర్షాకాలంలో వచ్చే నీరు తప్ప మిగతా నీరు పూర్తిస్థాయిలో బయటకు వెళ్లడం లేదు. దింతో చాకలి వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్న నాయకుల వాగ్దానాలు నీటి మూటలుగా మిగిపోతున్నాయే తప్ప తాము ఎదుర్కొంటున్న సమస్య మాత్రం తిరడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దోబీఘాట్ కోసం స్థలాన్ని కేటాయించి నిర్మించాలని కోరుతున్నారు.



**ప్రభుత్వం దోబీఘాట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి**
**-మలిగే శ్రీకాంత్(రజకుడు)**

ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ఉన్న గ్రామాలలో తన స్వంత నిధులతో గల్లీ గల్లీకి సీసీ రోడ్లు, గ్రామాలలో దేవాలయాలు, మసీదుల నిర్మాణాలు చేసానని పలుమార్లు గొప్పలు చెప్పుకున్నాడు. అదే చొరవతో ఎమ్మెల్యే మల్లారెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా తమకు ఉపాధి కోల్పోడానికి కారణమైన దోబీఘాట్ ను మరో చోట నిర్మించి వృత్తి పై ఆధారపడి జీవిస్తున్న గుండ్లపోచంపల్లి రజకులు పడుతున్న ఇబ్బందులకు దారి చూపాలని కోరుతున్నారు.

**నేరవేరని ఎమ్మెల్యే మల్లారెడ్డి హామీ**

మేడ్చల్ ఎమ్మెల్యే గా మూడుసార్లు ఎన్నికైన మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే చమకూర మల్లారెడ్డికి గుండ్లపోచంపల్లికి చెందిన రజకులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి దోబీఘాట్ సమస్యపై పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేదన్నారు. ఎన్నికల సమయంలో కులాల వారిగా అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీలు ఇవ్వడమే తప్ప తమకు చేసింది ఏమి లేదన్నారు. గుండ్లపోచంపల్లి గ్రామ పంచాయతీ నుంచి పురపాలక సంఘంగా మారడంతో మున్సిపల్ పరిధిలో వెలసిన వెంచర్లు, విల్లాల వల్ల చాకలి వృత్తి చేసుకోవడానికి ఉపాధి పెరిగినప్పటికీ మురికి బట్టలు ఉతికేందుకు సరైన దోభీఘాట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ శాసన సభ్యుడు చామకూర మల్లారెడ్డికి మున్సిపాలిటీకి చెందిన రజకులు వృత్తిని నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించి దోభీఘాట్ నిర్మాణానికి చొరవ చూపాలని గతంలో పలుమార్లు వినతిపత్రం సమర్పించిన ఫలితం లేకుండా పోయిందని రాజకీయ నాయకులు తమను ఓటు వేసే యంత్రంగా చూస్తున్నారే తప్ప తమ గోడు వినడంలేదని రజకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ధోభీఘట్ ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ మంత్రి మల్లారెడ్డి ఇచ్చిన మాటలు నీటి మూటలుగానే మారాయని హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా తమ సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని రజకులు ఆరోపిస్తున్నారు. రజకులు కులవృత్తిలో భాగంగా బట్టలు ఉతకడానికి మరో దోబీఘాట్ నిర్మిస్తే తప్ప రజకుల జీవనోపాధికి అవకాశం లేదని ఇప్పటికైనా తమకు సరైన స్థలం కేటాయించి ధోభీఘట్ నిర్మించి ఆదుకోవాలని వాపోతున్నారు.






# కాలనీ సంక్షేమానికై ఎల్లవేళలా సహాయ పడతా..

**జయభేరి, కాప్రా :**

శ్రీ భావనఋషి వెల్ఫేర్ అసోవియేషన్ పద్మశాలి టౌన్షిప్ నూతనంగా బాలట్ పద్దతి ద్వారా ఎన్నికైన ప్యానెల్ సభ్యులు ఎమ్మెల్యే BLRని AS Rao Nagar లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో ఉన్న పారిశుధ్య సమస్యలూ, స్ట్రీట్ లైట్, సెంట్రల్ లైటింగ్ సమస్యలపై విన్నవించుకోవడం జరిగింది... ఎమ్మెల్యే తక్షణం స్పదించి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. కాలనీ సంక్షేమానికై తాము ఎల్లవేళలా సహాయ పడతానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ మాజీ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి టౌన్షిప్ ప్రెసిడెంట్ ఎం నరేంద్ర రెడ్డి, హోనరరీ ప్రెసిడెంట్ నవీన్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ కళ్లెం రాము, జనరల్ సెక్రటరీ నామాల సుగుణేశ్వర్, ట్రెజరర్ సదానందం గౌడ్, మాదిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ లత నర్సింహ, శివా రెడ్డి కుమార స్వామి, పరమేశ్, అఖిల్, రామన్న, అంద్రూస్, శ్రావణ్, రవి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్లాసిక్ మటన్ అండ్ చికెన్ షాప్ ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే




**జయభేరి, ఉప్పల్:**

చిలుక నగర్ డివిజన్లోని ప్రధాన రహదారిలో పోచమ్మ ఆలయం పక్కన క్లాసిక్ మటన్ అండ్ చికెన్ షాపును ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, అనంతరం వారు మాట్లాడుతూ.. మహమ్మద్ షర్ఫుద్దీన్ & సన్స్ ఎండ్ గౌస్, జాంగిర్, అబ్బాస్ కలిసి మటన్ అండ్ చికెన్ షాప్ ను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమని, యువత ప్రభుత్వ ఉద్యోగాల పై ఆధారపడకుండా స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకున్న జాంగిర్ అండ్ సన్స్ ని ఎమ్మెల్యే అభినందిస్తూ ప్రజలకు నాణ్యమైన అందుబాటులో ఉండే ధరలకు మటన్ అండ్ చికెన్ని అందించాలని కోరుతూ వారికి మరొకసారి నూతన షాపు శుభాకాంక్షలు తెలుపుతూ ఇటువంటి షాపులు మరెన్నో ఏర్పాటు చేసి అంచలంచెలుగా ఎదగాలని వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మైనారిటీ నాయకులు మొదలగువారు పాల్గొన్నారు.



# ల్యాండ్ ఓనర్ చనిపోయినట్లుగా ఫేక్ డెత్ సర్టిఫికేట్

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల చెంగిచెర్ల గ్రామం లోని రామకృష్ణ లే అవుట్ కు చెందిన 1000 చదరపు గజాల విస్తీర్ణం గల ల్యాండ్ ను అట్టి ల్యాండ్ ఓనర్ లు అందుబాటులో లేకపోవడంతో అట్టి ప్లాట్ లను ఎలాగైనా ఆక్రమించాలనే దురుదేశ్యంతో అట్టి ల్యాండ్ ఓనర్ లు చనిపోయినట్లుగా ఫేక్ డెత్ సర్టిఫికేట్ లు క్రియేట్ చేసి, అట్టి ల్యాండ్ ఓనర్ లకు గుర్తు తెలియని వ్యక్తులను లీగల్ హైర్ సర్టిఫికేట్ లు సృష్టించి, అట్టి ల్యాండ్ ను వారి మీద రిజిస్ట్రేషన్ చేయించి, తర్వాత వారి దగ్గర నుండి అట్టి వ్యక్తులు వారి మీద రిజిస్ట్రేషన్ చేసుకుని తర్వాత మిగతా వ్యక్తులకు తక్కువ రేట్ కు ల్యాండ్ వస్తుందని వారందరూ కలిసి కుమ్మక్కు అయ్యి వచ్చిన డబ్బులను అన్నిటిని సమానంగా పంచుకోగా, అట్టి ల్యాండ్ GPA హోల్డర్ అయిన ముళ్ళపూడి వెంకట సుబ్బారావు అను వ్యక్తి ఫిర్యాదు మేరకు వారి అందరి మీద కేసు నమోదు చేసి, శనివారం ల్యాండ్ ఆక్రమించిన వ్యక్తులలో ఓల్డ్ బోయినపల్లికి చెందిన కట్టిక్ మాల, ఘాస్ మండికి చెందిన సంగం జ్యోత్స్న, తుపాకి రాజు అను వ్యక్తులను పట్టుకుని రిమాండ్ కు తరలించడం జరిగినది. జూన్ నెలలో ఇదే కేసు విషయంలో మల్లాపూర్ కు చెందిన లింగాల రవీందర్, చెంగిచెర్లకు చెందిన తీగల దేవేందర్ అను వ్యక్తులను పట్టుకుని రిమాండ్ కు తరలించడం జరిగినది. ఇట్టి కేసులో ఇంకా కొంతమంది పరారీలో ఉన్నారు. అయితే ఇట్టి ల్యాండ్ ఆక్రమించిన వ్యక్తులలో చాలా మంది గతంలో కూడా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇదే విధంగా ల్యాండ్ ను ఆక్రమించగా కీసర పోలీస్ స్టేషన్ లో Cr.No. 304/2022 U/Sec 406, 468, 471, 476, 419, 420, 120B IPC కేసు నమోదు కాగా కీసర పోలీస్ వారు వారిని జైల్ కు పంపడం జరిగినది.



# ప్రమాణ స్వీకారం చేసిన అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నూతన కమిటీ సభ్యులు శనివారం ఉదయం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ గౌరవ అధ్యక్షులు గురుస్వామి చిలువేరు చంద్రమౌళి అధ్యక్షతన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారి గోవర్ధనాచార్యులు చే ఆశీర్వచన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన అధ్యక్షుడు పెండ్కర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ ప్రతిష్టను పెంచడానికి తమ వంతు కృషి చేస్తానని, పారదర్శకంగా పనిచేసి,ఆలయ పరిరక్షణ కోసం అంకితమావుతమని వారు ప్రమాణం చేశారు. ప్రతి కార్యవర్గ సమావేశంలో కార్యవర్గ సభ్యులందరూ పాల్గొంటూ సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు సన్నిహితులు,భక్తులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులకు ఆలయం బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో



కార్యదర్శి చిలువేరు శ్రీనివాసులు, కోశాధికారి సోమ నరేందర్ ఉపాధ్యక్షులు బొడిగే రవీందర్ గౌడ్, రాచమల్ల వెంకటేశ్వర్లు(ఆర్ వి టి), నీలా రవి కుమార్, పగిడిమర్రి రఘురాములు, నక్క వెంకటేష్‌యాదవ్, గార్లపాటి ఎల్లయ్య, నేలాంటి ధనంజయ, బెజవాడ నరేందర్, కొత్త సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు సముద్రాల నరహరి, జైపాల్ రెడ్డి, మాధవరెడ్డి, చీదల్ల వెంకటేశ్వర్లు, నీల సంజీవ్ కుమార్, వనం కృష్ణ,గోవింద శేఖర్, గోపర్ల శీను, చేరుపల్లి బాలరాజు,పాంపాటి శ్రీధర్, నీలంటి వెంకన్న, వనం చంద్రమౌళి టీచర్, కర్నాటి పురుషోత్తం, ముత్యాల రవి, పులిజాల సన్నీ, మహిళా సభ్యులు మాదిని సంధ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎన్జీవోస్ కేంద్ర సంఘం నూతనంగా నియమితులైన డీజీపీ స్వాగతం

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ ఆధ్వర్యంలో జితేందర్ సీనియర్ ఐఏఎస్ అధికారి తెలంగాణ డిజిపిగా నియామకం సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. డిజిపి ఆఫీస్ లో పనిచేయుచున్న ఉద్యోగులతో పాటు వివిధ ఆఫీసులో పని చేసిన ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరడం జరిగింది. వారు కూడా సానుకూలంగా స్పందించి మీరు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిగా పని చేయుచున్నారు. మీకు కావాల్సిన భద్రత కల్పించడం మా బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, సిటీ ఆఫ్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీకాంత్, భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# రేషన్ డీలర్లు బియ్యం కొంటే కేసు నమోదు

- రేషన్ కార్డు దారులు బియ్యం అమ్మితే కార్డు రద్దు
- హనుమంతు శ్రీనివాసు గౌడ్, డిప్యూటీ తాసిల్దార్ సివిల్ సప్లై



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని దేవరకొండ సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్ శనివారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పక్కా సమాచారం మేరకు పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ పరిసర ప్రాంతంలో నుండి ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ బియ్యని పట్టణానికి చెందిన తేలుకుంట్ల రమేష్ కొనుగోలు చేసినట్లు నిర్ధారించారని అన్నారు. ఆటోలో సుమారు 14 బస్తాలలో (6 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, పోలీస్ స్టేషన్ కు తరలించి , ఆటో సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దేవరకొండ నుంచి చారగొండ కి రేషన్ బియ్యం రవాణా చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని రవాణా చేసినా, కొనుగోలు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నిరుపేదలకు చెందాల్సిన పి డి ఎస్ బియ్యాన్ని అక్రమంగా ఎవరైనా తరలిస్తే వారి పెట్టిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రేషన్ డీలర్లు ఎవరైనా కార్డుదారుల వద్ద బియ్యం కొంటె వారిపై కేసు నమోదు చేస్తామని, కార్డుదారులు బియ్యం తీసుకొని దళారులకు అమ్మినట్లయితే వారి కార్డు రద్దు చేస్తామని హెచ్చరించారు. సివిల్ సప్లై రేషన్ షాపులపై విస్తృతమైన తనిఖీలు చేయబడుతుందని, బియ్యం అక్రమ రవాణా చేసే వ్యక్తులు ఈ రకమైన వ్యాపారాన్ని వెంటనే మానుకోవాలని, బియ్యం అక్రమ రవాణాల పలు కేసులు నమోదైన వారిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# అమెరికా భక్తుల సెల్ ఫోన్ చోరీ

- గంటలో రికవరి చేసిన యాదాద్రి ఎస్పీఎఫ్ పోలీసులు

**జయభేరి, యాదాద్రి:**

యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి అమెరికా చెందిన భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి కొండపైకి వచ్చారు. స్వామివారి దర్శనానికి వెళ్లడానికి ఆలయ పరిసరాల్లో సెల్ ఫోన్ పక్కన పెట్టి నిలబడ్డారు భక్తులు వెంటనే తమ సెల్ ఫోను చోరీకి గురైందని కొండపైన విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సిబ్బంది సీసీ కెమెరాలు సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా కొండ కింద బస్ స్టాప్ వద్ద హైదరాబాద్ కు చెందిన భక్తులు సెల్ ఫోన్ తో వెళ్తుండగా వెంటనే దొంగను అదుపులోకి తీసుకొని యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ కు తరలించారు. అమెరికా చెందిన భక్తులు తమ డేటా మొత్తం సెల్ ఫోన్ లోనే ఉంది సెల్ ఫోన్ చోరీ జరిగిన గంటలోపే తమ సెల్ ఫోను అందజేసిన ఎస్పీఎఫ్ సిబ్బందికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# జైల్ లో పరిచయం.. గంజాయి స్మగ్లింగ్...


## ఒరిస్సా టూ వేములవాడ

జయభేరి, కరీంనగర్, జూలై 13 :

యువత బతుకును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ ను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతుంది. గంజాయి వాసన లేకుండా సమూలంగా నిర్మూలించేందుకు పోలీసులు నిఘా పెట్టగా ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడలో మొన్న గంజాయి ముఠా పట్టుబడగా, తాజాగా ధర్మపురి లో మరో ముఠా పట్టుబడింది.ఒడిశా వయా ఏపీ మీదుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి సప్లై చేస్తూ యువత బతుకు ఆగం చేస్తున్న స్మగ్లర్ ల ఆటపట్టిస్తున్నారు పోలీసులు. వారం రోజుల్లో రెండు ముఠాలకు చెందిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి దాదాపు 20 కిలోల ఎండు గంజాయిని, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు.దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలో వారం రోజుల క్రితం గంజాయి స్మగ్లర్ ఒడిస్సా కు చెందిన పుర్థి బిర్సా పోలీసులు అరెస్టు చేసి 14 కిలోల 590 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అది మరిచిపోకముందే తాజాగా ధర్మపురి పోలీసులకు మరో ముఠా పట్టుబడింది. ధర్మపురి లో పట్టుబడ్డ ముఠాకు చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ వారి నుంచి 6.03 కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్ లు, 3500 నగదు స్వాధీనం చేసుకున్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎస్పీ అశోక్ కుమార్ సమక్షంలో అరెస్టు అయిన గంజాయి స్మగ్లర్ లను చూపించి వివరాలు వెల్లడించారు.

ధర్మపురి మండలం దొంతాపూర్ కు చెందిన దుర్గం రాము, సునర్కాని అజయ్, మగ్గిడి గ్రామానికి చెందిన దుర్గం సంజయ్, రాయపట్నం కు చెందిన బత్తిని చందు,గొల్ల వెంకటేష్ ముఠాగా ఏర్పడి గంజాయి స్మగ్లింగ్ తోపాటు విక్రయిస్తున్నారని ఎస్పీ తెలిపారు.ఈ ఐదుగురు ఒడిస్సా లో గంజాయి పండించే దినేష్ కుమార్ నాయక్ నుంచి ఏపి విజయనగరం కు చెందిన గుజ్జల పురుషోత్తం ద్వారా కొనుగోలు చేసి ధర్మపురి తోపాటు పలు ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. ఈనెల 4న బత్తిని చందు, గొల్ల వెంకటేష్, దుర్గం రాము లపై ధర్మపురి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి చందు, వెంకటేష్‌లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామని తెలిపారు. పరారీలో ఉన్న రాము కోసం గాలిస్తుండగా ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి వద్ద రాము తోపాటు ఒడిస్సా కు చెందిన దినేష్ కుమార్ నాయక్, విజయనగరం కు చెందిన గుజ్జల పురుషోత్తం చిక్కారని తెలిపారు. అజయ్, దుర్గం సంజయ్ పరారీలో ఉన్నట్లు ప్రకటించారు.రెండేళ్ల క్రితం ఒడిశా చెందిన దినేష్ కుమార్ నాయక్, ఏపీకి చెందిన పురుషోత్తం ముఠాతో పరిచయం ఏర్పడిందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అప్పటినుంచి ముఠా సభ్యులు ఒడిశా రాయగడ్ రైల్వే స్టేషన్ కు వెళ్లి అక్కడ దినేష్ కుమార్ నాయక్ నుంచి పురుషోత్తం ద్వారా గంజాయిని కొనుగోలు చేసి జగిత్యాల జిల్లాకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. రెండేళ్లుగా ఈ అక్రమ దందా సాగిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. ముఠా పై ధర్మపురి లో NDPS1985Act Cr.no 219/2024 u/s 20 (b) (ii) (B) NDPS చట్టం క్రింద కేసు నమోదు చేశామని పీడీ యాక్ట్ అమలు చేస్తామని ఎస్పీ చెప్పారు.గంజాయి ముఠాలో ఏ2 గా దినేష్ కుమార్ నాయక్, A3 గుజ్జల పురుషోత్తం గతంలో రాయగడ పీఎస్‌లో ఎన్‌డిపిఎస్ యాక్ట్ కేసులో జైలుకు వెళ్లగా, ఇద్దరికీ రాయగడలో జైల్ లో పరిచయం ఏర్పడిందని ఎస్పీ తెలిపారు. ఆ పరిచయంతో జైలు నుంచి బయటికి వచ్చాక మళ్లీ గంజాయి స్మగ్లింగ్ దందా సాగిస్తూ ధర్మపురి పోలీసులకు చిక్కారని తెలిపారు. ఇద్దరిపై ఒడిశా లో, విజయనగరం GRP పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు.గంజాయి డ్రగ్స్‌పై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఓ వైపు గంజాయి పై ఉక్కుపాదం మోపడం తోపాటు గంజాయి డ్రగ్స్ వినియోగంతో ఉత్పన్నమయ్యే పరిణామాల పై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. యువత, పాఠశాల, కళాశాల విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీ (ఏడీసీ)లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జగిత్యాల ను గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహిస్తామని ఎస్పీ చెప్పారు. జిల్లాలో గంజాయికి సంబంధించిన సమాచారం సబంధిత పోలీస్ లకు లేదా డయల్ 100కు అందించి గంజాయి రహిత జిల్లాగా మర్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు.









# పులస క్రేజ్... మాములుగా లేదుగా

- 2 కేజీల పులస - రూ. 24 వేలు...


జయభేరి, కాకినాడ, జూలై 13 :

రెండు కేజీల చేప ధర ఎంతుంటాది..! మహా అయితే 300 లేదా 400 ఉంటుంది. కానీ రెండు కేజీల చేప ఏకంగా రూ.24 వేలంట..! నిజమే రెండు కేజీల చేప ధర ఏకంగా రూ.24 వేల ధర పలికింది. అది మామూల చేప కాదు... పులస చేప. కోనసీమ జిల్లాలో గోదావరి నదిలో చేపల వేటలో మత్స్యకారులకు చిక్కింది. ఆ మత్స్యకారుల పంట పండింది.గోదావరి వరదల సమయంలో మాత్రమే అరుదుగా దొరికే పులస చేప శుక్రవారం కోనసీమ జిల్లాలో మత్స్యకారుల వలకు చిక్కింది. దీంతో ఆ మత్స్యకారుల ముఖాల్లో ఆనందం అంతుపట్టని విధంగా ఉంది సంతోషంతో గోదావరి నది ఒడ్డుకు వచ్చిన వెంటనే చేపను బేరం పెట్టారు. తమకు తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి మరి బేరం ఆడారు. కేవలం రెండు కేజీల పులస చేపను ఆ మత్స్యకారులు ఏకంగా రూ.24 వేలకు అమ్మారు.కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంక బాడవలో శ్రీను అనే మత్స్యకారుడు, మరో మత్స్యకారుడితో కలిసి చిన్న బోటుపై శుక్రవారం చేపల వేటకు గోదావరి నదిలోకి వెళ్లాడు. వేటకు వెళ్లిన కొద్ది సమయానికే వారికి గోదావరి వరదల సమయంలో మాత్రమే దొరికే అత్యంత అరుదైన పులస చేప దొరికింది. దీంతో ఆ మత్స్యకారులు చేపలు వేట వేయకుండా అదృష్టం కలిసి వచ్చిందనుకొని ఒడ్డుకు చేరుకున్నారు. అప్పటికే పులస చేప దొరికిందని ఓ వ్యక్తికి సమాచారం ఇవ్వడంతో అతను తనకు తెలిసిన వారికి ఫోన్ చేసి బేరం ఆడుతూ... ఆ పులస చేపతో మత్స్యకారులు వస్తున్న బోటు వైపు వెళ్లాడు. మత్స్యకారుల బోటు ఒడ్డుకు వచ్చింది. బోటు మీద నుంచి మత్స్యకారులు ఇంకా దిగనే లేదు. చేప బేరం ఆడుతూ వచ్చిన వ్యక్తి అక్కడికి చేరుకున్నాడు. ఒడ్డున బోటు నిలిపివేసి ఇద్దరు మత్స్యకారులు బోటుపైనే ఉన్నారు. వారి దగ్గరకు వచ్చిన మత్స్యకారుడు ఫోన్‌లో చేప కేజీన్నర వస్తుందని... అంతకంటే దాటుతుందని, చేప బాగుందని అవతల వ్యక్తికి ఫోన్‌లో చెప్పాడు. అలాగే మత్స్యకారులను ధర ఎంతని అడిగాడు. దీంతో ఏముందీ రూ.30 వేల అని పులస చేప ధర చెప్పాడు.ఇదే మొదటి చేప అని... ఎక్కడ పడలేదని, ఇక్కడే పడిందని మత్స్యకారులు చెప్పారు. మీకు తెలుసు కదా పులస చేప ధర ఎంత ఉంటుందో అని మత్స్యకారులు అన్నారు. అయితే ఫోన్ మాట్లాడుతూ వచ్చిన వ్యక్తి మొదట రూ.23 వేలుకి అడిగాడు. వారు అలా కుదరదన్న అనే సరికి... మరో వెయ్యి కలిపి రూ.24 వేలుకి ఇచ్చేయండి అడిగాడు. దీంతో మత్స్యకారులు ఆ చేపను రూ.24 వేలకు అమ్మారు. అయితే ఈ చేపను అప్పనరామునిలంక మాజీ సర్పంచ్ కొనుగోలు చేశారు. దీని బరువు తూకం వేస్తే రెండు కేజీలు వచ్చింది.

**పులస చేప ప్రత్యేకతలు**

వరదల సమయంలో సముద్రం నుంచి పులసలు గోదావరి నీటిలోకి ఎదురు ఈదుకుంటూ వస్తాయి. పులస చేప వర్షాకాలంలోని గోదావరి నదిలో మాత్రమే దొరుకుతుంది. ఇది చాలా రుచిగా ఉంటుంది. పుస్తెలు అమ్మి అయినా పులస తినాలనే సామెత కూడా బాగా ప్రాచుర్యం పొందింది. ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ చేప ప్రసిద్ధి చెందింది. అయితే ఇదే చేప సముద్రంలో దొరికితే దానిని వలస చేప అంటారు. హుగ్లీ నదిలో కూడా ఈ చేప దొరుకుతుంది. అక్కడ హిల్సా అని పిలుస్తారు.

# ఐఏఎస్ పూజా... సర్వీస్ నుంచి తొలగింపు




జయభేరి, ముంబై, జూలై 13:

ట్రెయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగులో చూస్తున్నాయి. పూజా ఖేద్కర్ కుటుంబసభ్యులు కూడా గతంలో అనేక అక్రమాలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఆమె తల్లి మనోరమ గతంలో అనేక అరాచకాలకు పాల్పడిన విషయాలు బయటకొచ్చాయి. మనోరమ తల్లి గతంలో ఓ వ్యక్తిని తుపాకీతో బెదిరించిన వీడియోలు అందరినీ షాక్‌కు గురిచేసేలా ఉన్నాయి. కొందరు గ్రామస్థులను మనోరమ చిన్న రివాల్వర్‌తో బెదిరించారు. వీడియోల్లో ఈ విషయం స్పష్టంగా కనిపించింది. చేతిలో తుపాకీ పట్టుకొని గ్రామస్థుల దగ్గరకు వెళ్లిన పూజా ఖేద్కర్ తల్లి.. వారితో దురుసుగా వ్యవహరించింది. తన పేరిట ఆ భూమి పత్రాలు ఉన్నాయని మనోరమ వాదించింది.తనకు రూల్స్ చెప్పొద్దని వారికి రైతులకు వార్నింగ్ కూడా ఇచ్చింది. పూజ తండ్రి, మనోరమ భర్త దిలీప్ రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్. ఆయన భారీగా ఆస్తులు కూడబెట్టారు. పుణే జిల్లాలో ముల్షీ తాలూకాలో 25 ఎకరాలు సంపాదించారు. పక్కనే ఉన్న రైతుల భూములను ఆక్రమించేందుకు వారి కుటుంబం ప్రయత్నించినట్టు ఆరోపణలు ఉన్నాయి. వారి దౌర్జన్యాలను రైతులు ప్రతిఘటించడంతో దిలీప్ భార్య మనోరమ కొందరిని వెంటబెట్టుకుని తుపాకీతో రైతులను బెదిరించారు. ఈ విషయంపై రైతులు పుణెలోని పౌడ్ పోలీస్‌స్టేషన్‌లో దిలీప్ కుటుంబంపై ఫిర్యాదు చేశారు. పుణేలో అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉద్యోగంలో చేరకముందే తనకు ఎన్నో సౌకర్యాలు కావాలని పూజా డిమాండ్ చేయడంతో వివాదం చెలరేగింది. తన ప్రైవేట్ ఆడి కారుకు రెడ్‌బ్లూ బీకన్ లైట్లు, వీఐపీ నంబర్‌ప్లేటు పెట్టారు. మహారాష్ట్ర ప్రభుత్వం అనే స్టిక్కర్ అమర్చారు. తనకు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని, తగినంత సిబ్బందితోపాటు ఓ కానిస్టేబుల్‌తో అధికారిక ఛాంబర్‌ను కేటాయించాలని పట్టుబట్టారు. అధికారులకు ఆమె పంపించిన వాట్సాప్ సందేశాలు బయటపడ్డాయి.ఉద్యోగం కోసం ఓబీసీ సర్టిఫికేట్ తో పాటు కంటి సమస్యకు సంబంధించి తప్పుడు పత్రాలు సమర్పించినట్టు ఆరోపణలు వచ్చాయి. నకిలీ అంగవైకల్యం సర్టిఫికేట్ తో ఆమె ఉద్యోగం పొందారా ? అన్న విషయంపై కూడా సందేహాలు కలుగుతున్నాయి. సివిల్స్‌లో 841 ర్యాంక్ వచ్చినప్పటికి ఓబీసీ సర్టిఫికేట్ తోనే ఆమె ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. పూజా తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేసి రిటైర్ అయ్యారు. క్రిమీలేయర్ కిందకు రావడంతో ఆమెకు ఓబీసీ రిజర్వేషన్ వర్తించదన్న వాదన కూడా ఉంది. పూజా ఓబీసీ సర్టిఫికేట్‌పై ఐఏఎస్ అకాడమీ దర్యాప్తు చేపట్టింది. పూజా ఖేద్కర్ వ్యవహారంపై ప్రధాని కార్యాలయం ఇప్పటికే దర్యాప్తుకు ఆదేశించింది. ఒక సభ్యుడితో ఏర్పాటుచేసిన ఈ కమిటీ రెండు వారాల్లో నివేదిక ఇవ్వనుంది. ఇందులో పూజా ఖేద్కర్ అవకతవకలకు పాల్పడినట్టు తేలితే.. ఆమెను విధుల నుంచి తొలగించే అవకాశం ఉంది.మరోవైపు తమ ఇంటి సమీపంలో ఉన్న పూట్ పాత్‌ను పూజా ఖేద్కర్ ఆక్రమించిందనే ఆరోపణలపై పుణే మున్సిపల్ అధికారులు స్పందించారు. ఆక్రమణలు నిజమే అని తేలడంతో వాటిని తొలగించాలని నిర్ణయించారు. జేసీబీలను తరలించి వాటిని కూల్చే ప్రక్రియను మొదలుపెట్టారు.

# సూసైడ్ అటెంప్ట్ లో లావణ్య





జయభేరి, హైదరాబాద్, జూలై 13:

టుడు రాజ్‌తరుణ్ ప్రేమ కేసులో లావణ్య పెట్టిన మెసేజ్ సంచలనంగా మారుతోంది. చచ్చిపోతున్నానంటూ ఓవైపు లాయర్‌కు మెసేజ్ చేసిన ఆమె... డయల్ 100కు ఫోన్ చేసి ఇదే విషయం చెప్పారు. తన చావుకు రాజ్‌తరుణ్, మాల్వీ ఫ్యామిలీయే కారణమని చెప్పారు. నటుడు రాజ్‌తరుణ్ లావణ్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఇప్పుడు లావణ్య పెట్టిన మెసేజ్ అందర్నీ షాక్‌కి గురి చేస్తోంది. తాను చచ్చిపోతున్నానంటూ లాయర్, పోలీసులకు ఒకేసారి సమాచారం ఇచ్చిన లావణ్య టెన్షన్ పెట్టారు. ముందు లాయర్‌తో కేసు విషయంలో చాటింగ్ చేస్తూ తాను వెళ్లిపోతున్నానంటూ మెసేజ్ చేశారు.రాజ్‌తరుణ్ లేకుండా తాను జీవించలేనని మెసేజ్ చేసిన లావణ్య ఈ లోకం నుంచి వెళ్లిపోతున్నానంటూ చెప్పుకొచ్చారు. ఆ మెసేజ్ చూసిన లాయర్ షాక్ అయి వెంటనేపోలీసులు సమాచారం ఇచ్చారు. ఇంతలో డయల్ 112 నుంచి కూడా నార్సింగ్ పోలీసులకు మరో సమాచారం వచ్చింది.తన మెసేజ్‌లో లావణ్య ఏం చెప్పారంటే..."నేను రాజ్ తరుణ్ భార్య లావణ్యని. నన్ను క్షమించండి. నా కోసం ఉన్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు. నేనూ ఏంటో తెలిసిన జనం నన్ను తప్పు అన్నారు. తెలియని మనుషులు నాకోసం సహాయం చేశారు. రాజ్ లేని జీవితం నేను ఉండలేను. బ్రతకలేను. ఈ ప్రపపంచంలో నేను ఉండలేను. నేను అన్నీ కోల్పోయాను. నేను వ్యవస్థను నమ్మాను కానీ నేను విఫలమయ్యాను. నేను మోసపోయాను. మైండ్ గేమ్‌లు, గాసిప్స్‌తో విసిగిపోయారు. నేను ఇందులో గెలవకపోవచ్చు కానీ నేను ఇప్పటికీ దేవుణ్ణి నమ్ముతాను నాకు ఇలా చేసిన వ్యక్తులను కచ్చితంగా దేవుడు చూస్తాడు. మస్తాన్ కేసు తర్వాత ప్రతిదీ ప్లాన్ ప్రకారంతో నాతో ఆడారు. నేను మాల్వీ మల్హోత్రాని అభ్యర్థించి, వేడుకున్న పట్టించుకోలేదు. మాకూ తిన్నడానికీ తిండి లేదూ అని అడుక్కుంది అంటూ ఎంజాయ్ చేస్తున్నారు. రాజ్ పేరెంట్స్ కూడా ఒక ముఖ్య కారణం. రాజ్ మారిపోయాడు. అతను నా చావు కోరుకున్నాడు. నా చావుకు మాల్వీ మల్హోత్రా ప్రధాన కారణం. నా కుటుంబ సభ్యులకు, దిలీప్ కల్యాణ్‌కి మీడియాకు నా హృదయపూర్వక క్షమాపణలు. నన్ను క్షమించండి. అంటూ లావణ్య మెసేజ్ చేశారు. డయల్ 112కు ఫోన్ చేసిన లావణ్య... తాను చనిపోతున్నట్టు చెప్పారు. రాజ్‌తరుణ్ లేని జీవితాన్ని ఊహించుకోలేనని అన్నారు. తన చావుకు రాజ్‌తరుణ్ ఫ్యామిలీతో పాటు హిరోయిన్ మాల్వీ మల్హోత్రా ఫ్యామిలీ కారణమని పోలీసులకు చెప్పారు. ఈ సమాచారంతో పోలీసులు పరుగులు పెట్టారు.




# పంట నమోదు ప్రక్రియ చేపట్టాలి

- అవసరానికి సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలి
- వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయభేరి, జయశంకర్ భూపాలపల్లి:

జిల్లాలో వంద శాతం పంట నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనీవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ శాఖకు సంబంధించి రైతు భరోసా, పంట భీమా, పంట నమోదు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటు, వాటి తనిఖీ లు, మట్టి నమూనాలు సేకరణ, పంట దిగుబడి, లక్ష్యం, సాధింపు, వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు తదితర అంశాలపై వ్యవసాయ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వందకు వంద శాతం పంటనమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. రైతు భరోసా, రైతు భీమా, పీఎం కిసాన్ లాంటి పథకాలను క్షేత్ర స్థాయిలో రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వానాకాలంలో పంటలను కాపాడు కోవడానికి తీసుకునే చర్యలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని పంటలకు సరిపడా యూరియా , డిఏపి, ఇతర ఎరువులను అందుబాటులో ఉంచాలని, ఎరువుల కృత్రిమ కొరత, ఎరువులను అధిక ధరకు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక దిగుబడి వచ్చే లాభసాటి పంటలు, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతి 15 రోజులకొకసారి పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేయాలనీ, నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్ష పాతం తక్కువ నమోదైన నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగు చేపట్టేందుకు మొగ్గుచూపు విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వరి విత్తనాలు కొరత లేదని సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వర్షా భావ పరిస్థితులు నేపథ్యంలో వరి సాగుకు జాప్యం అవుతున్నందున రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నయంగా మొక్కజొన్న తదితర ఆరుతడి పంటల సాగు చేపట్టే విధంగా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. రానున్న 15 రోజుల్లో వర్షాలు పడనట్లయితే వరి సాగుకు అనుకూలత లేని కారణంగా ఆరుతడి పంటల సాగు విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. మిర్చి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి కొరతలేదని ఎక్కడైనా విత్తనాలు కొరత ఉన్నట్లయితే ఆయా మండల వ్యవసాయ అధికారులను కానీ లేదా జిల్లా వ్యవసాయ అధికారిని కానీ సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఏదేని సహాయతకు జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ 7288894787 నంబర్ కు నేరుగా కాల్ చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూవీభేరి



## ఆందోళనతో కుంగిపోయా

బిగ్‌బాస్ 16తో పాపులారిటీ సంపాదించుకున్న నటి నిమృత్ కౌర్ అహ్లూవాలియా. 'చోటి సర్దార్ని' టీవీ షోతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు బిగ్‌బాస్ షోలో స్పెషల్ అట్రాక్షన్‌గా సందడి చేసింది. నటిగా ఎదగాలంటే అంత తేలిక కాదని, దానికి ఎన్నో సవాళ్లను అధిగమించాల్సి ఉంటుందని చెబుతున్నది నిమృత్ కౌర్. ఒక సమయంలో తాను చాలా డిప్రెషన్‌కు గురయ్యానని, దాన్నుంచి బయటపడేందుకు ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పుకొచ్చింది. 'టీవీ సీరియల్ షూటింగ్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. దాంతో ఆందోళనకు గురవుతుండేదాన్ని. ఒకానొక దశలో డిప్రెషన్‌లోకి వెళ్లిపోయా. దాన్నుంచి బయటపడటానికి 40 రోజులు విరామం తీసుకున్నాను. ప్రస్తుతం సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చే పనిలో బిజీగా ఉన్నాను' అని చెప్పుకొచ్చింది ఈ యంగ్ బ్యూటీ.

## నాకు గౌరవమే ముఖ్యం

ప్రస్తుతం ప్రపంచమంతా అంబానీ ఇంట పెండ్లి వేడుక గురించే చర్చిస్తున్నది. అంగరంగ వైభవంగా జరిగిన పెండ్లి సందడికి బాలీవుడ్, టాలీవుడ్ సెలెబ్రిటీలు తరలి వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన హేమాహేమీలు ఎందరో హాజరయ్యారు. బాలీవుడ్ స్టార్లయితే స్టెప్పులు కూడా వేశారు. ఈ సందడిపై ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కూతురు ఆలియా కశ్యప్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'నన్ను ఓ భారీ ఈవెంట్‌కు ఆహ్వానించారు. కానీ, వారితో నేను రానని స్పష్టంగా చెప్పాను. ఎందుకంటే నాకు ఆత్మగౌరవం ఉంది. ఒకరి పెండ్లిలో నన్ను నేను అమ్ముకోవడం కంటే నాకు గౌరవమే ముఖ్యం. ఆ వివాహానికి ఎన్నిసార్లు ఆహ్వానించినా తిరస్కరించాను. అది పెండ్లిలా కాకుండా సర్కస్‌లా మారింది' అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆమె కామెంట్స్‌పై నెటిజన్లు ఒక్కొక్కరూ ఒక్కోరకంగా స్పందిస్తున్నారు. ఎవరేం అనుకున్నా.. తన ఫీలింగ్ అదేనని చెబుతున్నది ఆలియా.



## 1000 కోట్ల క్లబ్‌లో కల్కి..

ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' సినిమా వెయ్యికోట్ల మైలురాయిని చేరుకుంది. టాలీవుడ్‌లో రూపొందిన పానిండియా సినిమాల్లో వెయ్యికోట్ల మైల్‌స్టోన్‌ని చేరుకున్న మూడో సినిమాగా 'కల్కి 2898ఏడీ' నిలిచింది. 'బాహుబలి 2' 18వందలకోట్ల పై చిలుకు వసూళ్లను సాధించి టాలీవుడ్ నంబర్‌వన్ మూవీగా నిలువగా, రాజమౌళి 'ఆర్‌ఆర్‌ఆర్' దాదాపు 12వందలకోట్ల వసూళ్లతో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పుడు ప్రభాస్ 'కల్కి 2898ఏడీ' మూడోవారానికే వెయ్యికోట్ల మైలురాయి చేరుకోవడమే కాక, ఇంకా విజయవంతంగా ప్రదర్శింపబడుతున్నదని మేకర్స్ ఆనందం వెలిబుచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో వెయ్యి కోట్ల మైలురాయి చేరుకున్న రెండో సినిమా 'కల్కి 2898ఏడీ'. ఇప్పటికే పలు ప్రాంతాలో ఈ సినిమా నాన్ బాహుబలి రికార్డులన్నింటినీ తిరగరాసిందని మేకర్స్ చెబుతున్నారు.






## ముచ్చటగా మూడోసారి?

రవితేజ హీరోగా రూపొందిన 'పవర్' సినిమాతో దర్శకుడిగా పరిచయమై కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్‌గా నిలిచారు కె.ఎస్.రవీంద్ర(బాబీ). చిరంజీవితో ఆయన చేసిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రస్తుతం బాలకృష్ణతో సినిమా చేస్తూ బిజీగా ఉన్నారు బాబీ. ఈ సినిమాకు 'వీరమాస్' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఇదిలావుంటే.. బాబీ చేయబోయే నెక్స్ట్ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చేసింది. బాలయ్య సినిమా తర్వాత రవితేజతో చేయి కలుపనున్నారట బాబీ. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమా నిర్మించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కూడా జరుగుతున్నదని తెలుస్తున్నది. రవితేజతో బాబీ చేసిన పవర్, వాల్తేరు వీరయ్య సినిమాలు రెండూ మంచి విజయాలను అందుకున్నాయి. మళ్లీ ఈ ఇద్దరు కలుస్తున్నది నిజమే అయితే.. హ్యాట్రిక్ పక్కా అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com